సాక్షి
అనంతపురం
శుక్రవారం ◆ 5 ◆ జనవరి ◆ 2024



‘అనంత’ సాంకేతిక ‘దీప్తి’
జేఎన్‌టీయూ (ఏ) 13వ స్నాతకోత్సవం శనివారం జరగనుంది. చాన్స్‌లర్ హోదాలో గవర్నర్ నజీర్ హాజరు కానున్నారు. 8లో



కిలో టమాట రూ.20
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.20, కనిష్టంగా రూ.6, సరాసరిన రూ.14 ప్రకారం ధర పలికాయి.

గరిష్టం/కనిష్టం
30.4°/20.3°
జిల్లా అంతటా గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం వేళ చలి తీవ్రత పెరిగింది. పగలు ఆకాశం మేఘావృతమైంది. గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

గవర్నర్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



పోలీసులకు సూచనలిస్తున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం/బుక్కరాయసముద్రం: రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ జిల్లా పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. గురువారం ఆయన బుక్కరాయసముద్రం జెడ్పీ ఉన్నత పాఠశాల, అనంతపురం జేఎన్‌టీయూ ఆడిటోరియం పరిశీలించారు. బందోబస్తు ఏర్పాట్లపై పోలీసులకు దిశానిర్దేశం చేశారు. ఈ నెల 6న బీకేఎస్‌లో నిర్వహించే ‘వికసిత్ భారత సంకల్ప యాత్ర’ కార్యక్రమాన్ని గవర్నర్ పరిశీలిస్తారన్నారు. అనంతరం జేఎన్‌టీయూలో జరిగే స్నాతకోత్సవంలో పాల్గొంటారన్నారు. అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (ఏఆర్) ఎ.హనుమంతు, డీఎస్పీలు జి.ప్రసాదరెడ్డి, బి.వి.శివారెడ్డి, బుక్కరాయసముద్రం సీఐ వెంకటేశ్వర్లు, వన్‌టౌన్ సీఐ రెడ్డెప్ప, తదితరులు పాల్గొన్నారు.

కంటిపాపను మింగిన నీటికుంట



కిరణ్‌కుమార్ మృతదేహం

రాయదుర్గం(డి హీరేహాళ్): ఒక్కడే కుమారుడు. అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. కూలీ పనులకు వెళ్తూనే కంటికి రెప్పలా కాచుకుంటున్నారు. అలాంటి వారిపై విధికి కన్నుకుట్టింది. వారి కంటి పాపను కబళించేసింది. తీరని శోకంలోకి నెట్టేసింది. నీటి కుంటలో పడి మూడేళ్ల చిన్నారి ప్రాణాలు కోల్పోయిన ఘటన డి హీరేహాళ్ మండలం హిర్దేహాళ్ సమీపంలోని పీవీసీ పైపుల ఫ్యాక్టరీలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రంగడుయాదవ్ తెలిపిన మేరకు.. హిర్దేహాళ్‌కు చెందిన మాలమ్మ, నాగప్ప దంపతులు. స్థానిక పీవీసీ పైపుల ఫ్యాక్టరీలో వాచ్‌మేన్‌లుగా పని చేస్తున్నారు. వీరి కుమారుడు, కోడలు హిర్దేహాళ్‌లో నివసిస్తున్నారు. కూలీ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. కుమారుడు కురుబ కిరణ్‌కుమార్ (3)ను గురువారం తన అవ్వాతాతలతో వదిలి పనులకు వెళ్లారు. ఫ్యాక్టరీ ఆవరణలో బంతితో ఆటలాడుకుంటున్న క్రమంలో అక్కడ ఉన్న నీటి కుంటలో కిరణ్‌కుమార్ పడిపోయాడు. గమనించిన మాలమ్మ మనవడిని రక్షించే క్రమంలో తను కూడా గుంతలో పడిపోయింది. ఫ్యాక్టరీలో పని చేసే కొందరు ఇద్దరినీ బయటకు తీయగా, అప్పటికే కిరణ్‌కుమార్ ప్రాణాలు కోల్పోయాడు. మాలమ్మను హుటాహుటిన బళ్లారి విమ్స్‌కు తరలించగా, ఆమె ప్రాణాపాయం నుంచి తప్పించుకుంది. ఒక్కగానొక్క కుమారుడి మృతితో ఆ తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. ఎంత పని చేశావు దేవుడా అంటూ వారు విలపించిన తీరు అందరినీ కన్నీరు పెట్టించింది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా, ఫ్యాక్టరీ ఆవరణలో నిబంధనలకు విరుద్ధంగా నీటి కుంటను ఏర్పాటు చేశారని స్థానికులు ఆరోపించారు.

కానుక అందె.. నవ్వులు చిందె



చియ్యేడులో లబ్ధిదారుకు పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



గుత్తిలో పింఛన్ నగదు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి



బెళుగుప్పలో లబ్ధిదారుకు పింఛన్ నగదు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

- రెండో రోజూ ఘనంగా ‘పింఛన్ పెంపు’ వారోత్సవాలు
- నగదు అందజేసిన ప్రజాప్రతినిధులు
- మురిసిన లబ్ధిదారులు

అనంతపురం: ‘వైఎస్సార్ పింఛన్ కానుక’ పంపిణీ జిల్లాలో పండుగలా సాగుతోంది. రెండో రోజు గురువారం కూడా సంబరాలు అంబరమంటాయి. పెరిగిన రూ.3 వేల పింఛన్ నగదు అందుకుని లబ్ధిదారులు మురిసిపోయారు. అవ్వాతాతల మోముల్లో సంతోషం వెల్లివిరిసింది. సంక్షేమ ప్రదాత సీఎం జగన్‌కు ప్రజలు అండగా నిలవాలని ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. ఇప్పటి వరకూ ప్రతి నెలా ఇచ్చే రూ.2,750 పింఛన్ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఈ జనవరి నుంచి రూ.3 వేలకు పెంచిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 8వ తేదీ వరకూ జిల్లావ్యాప్తంగా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. గురువారం పలు మండలాలు, మున్సిపాలిటీల్లో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు కొత్తగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు పత్రాలను అందజేసి ముఖ్యమంత్రి సందేశం వినిపించారు. వలంటీర్లు ఇళ్ల వద్దకే వెళ్లి పింఛను నగదు అందజేశారు.



గుత్తి మార్కెట్ యార్డులో నిర్వహించిన పింఛన్ పెంపు వారోత్సవంలో పాల్గొన్న లబ్ధిదారులు

- అనంతపురం రూరల్ మండల పరిధి చియ్యేడు, పూలకుంట, ఉప్పరపల్లి, ఆకుతోటపల్లి, ఇటుకలపల్లి, మన్నీల, కందుకూరు, కక్కలపల్లి గ్రామాల్లో నిర్వహించిన వారోత్సవాల్లో రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాప్తాడు నియోజకవర్గ పరిధిలోనే 49 వేల మందికి పింఛన్లు అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదని ఆయన పేర్కొన్నారు.
- గుంతకల్లు నియోజకవర్గ పరిధిలోని గుత్తి మార్కెట్‌యార్డ్‌లో జరిగిన పింఛన్ల పెంపు మహోత్సవంలో ఎమ్మెల్యే వై. వెంకట్రామి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జననేత జగన్‌కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూరు బి, మార్కెట్ యార్డ్ చైర్మన్ సునీల్ యాదవ్, పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.
- అనంతపురం నగరంలోని 32, 43వ డివిజన్ పరిధిలోని 46, 62,53 సచివాలయాల పరిధిలో మేయర్ వసీం సలీం ఆధ్వర్యంలో పింఛన్ పెంపు వారోత్సవాలు నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న పింఛన్ల పంపిణీ దేశానికే ఆదర్శమని కొనియాడారు.
- శింగనమల నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లోనూ పింఛన్ల పెంపు వారోత్సవాలను నిర్వహించారు. కొత్తగా ఎంపికైన లబ్ధిదారులకు అధికారులు మంజూరు పత్రాలు అందజేశారు. లబ్ధిదారులకు వలంటీర్లు రూ.3 వేల పింఛన్ పంపిణీ చేశారు.
- బెళుగుప్ప మండల కార్యాలయ ఆవరణలో నిర్వహించిన పింఛన్ల పెంపు మహోత్సవంలో ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 66 లక్షల మందికి సామాజిక పింఛన్లు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌దేనని కొనియాడారు. ప్రతి నెలా రూ.2 వేల కోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తోందన్నారు.
- తాడిపత్రి పట్టణ పరిధి కృష్ణాపురం ఒకటో రోడ్డులోని గ్రామ వార్డు సచివాలయంలో యువ నాయకుడు కేతిరెడ్డి సాయి ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహించారు. మాట నిలబెట్టుకుంటూ పింఛన్ నగదు పెంచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.
- కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ పింఛన్ పెంపు మహోత్సవాలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై లబ్ధిదారులకు నగదు అందజేశారు. సీఎం వైఎస్ జగన్ హయాంలోనే అన్ని వర్గాలకూ న్యాయం జరిగిందన్నారు.

డౌటెవరు.. ఔటెవరు?

- టికెట్లపై టీడీపీ సీనియర్లలో నిరాశ
- రెండు జిల్లాల అధ్యక్షుల్లో ఆందోళన
- అభ్యర్థుల ఎంపికపై అధిష్టానం మల్లగుల్లాలు
- బాబు నాన్చుడు ధోరణి కొంపముంచుతోందంటున్న నాయకులు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పరుగులు పెట్టిస్తోంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలకు పెద్ద పీట వేస్తూ వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా దూసుకుపోతోంది. ప్రతిపక్ష టీడీపీలో మాత్రం ఈ విషయంలో గందరగోళం నెలకొంది. గెలుపు గుర్రాలేవో, కుంటి గుర్రాలేవో తేల్చుకోలేక సతమతమవుతోంది. సీట్లు ఎవరికి ఇవ్వాలో తెలీక తలపట్టుకుంటోంది. ఈ నాలుగున్నరేళ్లు చురుకైన పాత్ర పోషించడంలో సీనియర్ నాయకులు ఘోరంగా విఫలమైన నేపథ్యంలో మళ్లీ వారికి టికెట్లిస్తే పుట్టి మునుగుతుందేమోనన్న ఆలోచనలో అధిష్టానం ఉన్నట్టు చర్చ జరుగుతోంది.

వీళ్లకు ఈసారి డౌటే..?

కొంతమంది సీనియర్ నాయకులకు ఈసారి టికెట్లు ఇవ్వడానికి అధిష్టానం నిరాకరిస్తోంది. ఇందులో తొలి వరసలోకి రెండు జిల్లాల పార్టీ అధ్యక్షులు ఉన్నట్టు తెలిసింది. కాలవ శ్రీనివాసులు రాయదుర్గంలో కచ్చితంగా ఓడిపోతారని, అందుకే పార్లమెంటుకు పంపించాలని ఆలోచిస్తున్నారు. శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథిని కూడా పెనుకొండ అసెంబ్లీ కాకుండా హిందూపురం పార్లమెంటుకు పోటీ చేయించాలన్న యోచనలో ఉన్నారు. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణను కృష్ణా జిల్లాకు పంపాలనే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది.

వీళ్లకు హుళక్కేనా?

గుంతకల్లులో జితేందర్‌గౌడ్‌ను తప్పించి మరొకరికి టికెట్ ఇవ్వాలనే ఆలోచనలో అధిష్టానం ఉన్నట్లు సమాచారం. ఇక.. శింగనమలలో బండారు శ్రావణికి టికెట్ అనుమానంగా ఉంది. ధర్మవరం టికెట్ రేసులో ఉన్న పరిటాల శ్రీరామ్‌కు నిరాశ ఎదురయ్యే పరిస్థితి కనిపిస్తోంది. గతంలో టీడీపీ తరఫున పోటీచేసి ఓడిపోయి, బీజేపీలో చేరిన వరదాపురం సూరిని తిరిగి పార్టీలో చేర్చుకుని టికెట్ ఇవ్వాలని ఉన్నారు. కళ్యాణదుర్గంలోనూ గతంలో పోటీచేసిన అభ్యర్థిని నిలపడం లేదు. అనంతపురం అర్బన్ టికెట్ ఈసారి ప్రభాకర్ చౌదరికి లేదని కరాఖండిగా చెప్పినట్లు తెలుస్తోంది. కదిరిలో కందికుంట ప్రసాద్‌కు నకిలీ డీడీల కేసులో శిక్ష ఖరారైన నేపథ్యంలో ఆయన భార్యకు టికెట్ ఇస్తే గెలుస్తుందా అన్న అనుమానంలో అధినాయకత్వం ఉన్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. అన్ని నియోజకవర్గాల్లోనూ పార్టీ అభ్యర్థుల ఎంపిక గందరగోళంగా ఉందని ఆ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులు చెబుతున్నారు. చంద్రబాబు నాన్చుడు ధోరణి తమ మెడకు చుట్టుకుంటోందంటూ ఆక్రోశం వెళ్లగక్కుతున్నారు.

రూ.20 కోట్లు ఎక్కడ తేవాలి?

ఇటీవల జిల్లాలోని టీడీపీ ఓ నియోజకవర్గ నేత టికెట్ కోసం ప్రయత్నించగా రూ.20 కోట్లు ఉంటే చూపించు టికెట్ ఆలోచిస్తాం అని అధిష్టానం చెప్పినట్లు తెలిసింది. రూ.20 కోట్లు రెడీ చేసుకుంటేనే టికెట్ ఇస్తామని, లేదంటే వేరే ఆలోచిస్తామని తెగేసి చెప్పడంతో చాలామంది నాయకులు బెంబేలెత్తుతున్నారు. రిజర్వుడు నియోజకవర్గ అభ్యర్థులకు కూడా డబ్బు రెడీ చేసుకుంటేనే టికెట్ ఉంటుందని చెబుతుండడంతో పోటీకి ముందుకొచ్చే అభ్యర్థులు కూడా వెనకడుగు వేస్తున్నారు. 2019 ఎన్నికల్లో టీడీపీని వైఎస్సార్‌సీపీ చావుదెబ్బ కొట్టింది. అధికారంలోకి వచ్చాక సీఎం జగన్ సంక్షేమ రథాన్ని పరుగులు పెట్టిస్తుండడంతో ఇప్పటికీ కోలుకోలేదు. ఈ క్రమంలోనే చంద్రబాబు వైఖరితో పార్టీ పరిస్థితి పూర్తిగా కనుమరుగైపోయే దశకు చేరుకుంటోందని ఆ పార్టీ కింది స్థాయి నాయకులు, కార్యకర్తలు నిట్టూరుస్తున్నారు.

సంక్షేమ ఫలాలు ఎస్సీ, ఎస్టీలకు చేర్చాలి

- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో జేసీ కేతన్‌గార్గ్, ఎస్పీ అన్బురాజన్

అనంతపురం అర్బన్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు అందేలా చూడాలని కలెక్టర్ ఎం. గౌతమి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్‌తో పాటు ఎస్పీ అన్బురాజన్, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. తండాల అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల పాఠశాలల్లో వైద్యశిబిరాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తు పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో 76 అట్రాసిటీ కేసులు దర్యాప్తు దశలో ఉండగా, 537 పెండింగ్‌లో ఉన్నాయంటూ ఆమె అసహనం వ్యక్తం చేశారు. దర్యాప్తు వేగవంతం చేసి త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

18 నుంచి ‘జన్ భాగిదారి’

విజయవాడలోని స్వరాజ్ మైదానంలో 125 అడుగుల డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 19న ఆవిష్కరిస్తారని కలెక్టర్ గౌతమి తెలిపారు. ఈ నెల 9 నుంచి 18 వరకూ జిల్లాలో జన్ భాగిదరి కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. పాఠశాలల్లో చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్ పోటీలు చేపట్టాలని డీఈఓని ఆదేశించారు. కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో వకృత్వ పోటీల నిర్వహణతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు, సచివాలయ స్థాయిలో వేడుకలు నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ గాయత్రిదేవి, ఆర్డీఓలు గ్రంధి వెంకటేష్, రాణి సుస్మిత, శ్రీనివాసులురెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ మధుసూదన్‌రావు, నగర పాలక కమిషనర్ భాగ్యలక్ష్మి, డీఎంహెచ్‌ఓ ఈ.భ్రమరాంబదేవి, డీఈఓ నాగరాజు, డీపీఓ ప్రభాకర్ రావు, ఉపాధి కల్పనాధికారి కళ్యాణి, డీఎస్పీలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ‘పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్’



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఎం.గౌతమి, చిత్రంలో ఎంపీ తలారి రంగయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, తదితరులు

అనంతపురం: స్థానిక జేఎన్‌టీయూ సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల క్రీడా మైదానంలో గురువారం 26వ ఇంటర్ పాలిటెక్నిక్ కళాశాలల స్పోర్ట్స్, గేమ్స్ మీట్ అట్టహాసంగా ప్రారంభమైంది. కార్యక్రమానికి ఎంపీ తలారి రంగయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, కలెక్టర్ ఎం.గౌతమి సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ నాగరాణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 6వ తేదీ వరకు కొనసాగనున్న క్రీడా పోటీలకు 26 జిల్లాల నుంచి 1,400 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వాలీబాల్, టెన్నిస్ పోటీలను ఉన్నతాధికారులు ప్రారంభించారు. క్రీడాకారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఎంపీ రంగయ్య మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు అనంతపురంలో నిర్వహించడం గర్వకారణమన్నారు. కలెక్టర్ గౌతమి మాట్లాడుతూ గెలుపోటములను క్రీడాకారులు సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తి చాటాలని కోరారు. మానసిక, శారీరక ఉల్లాసానికి క్రీడలు దోహదపడుతాయని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు చాలా అవసరమని సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ నాగరాణి పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు ఆర్.ఆశాజ్యోతి, సర్పంచ్ ఉదయ్ శంకర్, తిరుపతి సాంకేతిక విద్యాశాఖ ఆర్జేడీ నిర్మల్ కుమార్ ప్రియ, కాకినాడ సాంకేతిక విద్యాశాఖ ఆర్జేడీ సత్యనారాయణ, సాంకేతిక విద్యాశాఖ సెక్రటరీ కేవీ రమణబాబు, మంగళగిరిలోని సాంకేతిక విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాత పత్తి కొనుగోళ్లకు ప్రతిపాదనలు

అనంతపురం అగ్రికల్చర్: గతేడాది పండించి ఇళ్లలో నిల్వ చేసుకున్న పత్తిని మద్దతు ధరతో కొనుగోలు చేయాలని కోరుతూ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)కు ప్రతిపాదనలు పంపినట్లు మార్కెటింగ్‌శాఖ ఏడీ పి.సత్యనారాయణచౌదరి గురువారం తెలిపారు. పెద్దవడుగూరు, తదితర ప్రాంతాల్లో చాలా మంది రైతుల వద్ద పాత పత్తి ఉన్నట్లు గుర్తించామన్నారు. ఎంపీ తలారి రంగయ్య ద్వారా సీసీఐ ఉన్నతాధికారులను సంప్రదించినట్లు వెల్లడించారు. మద్దతు ధరతో కొనుగోలు చేస్తే రైతులకు ఉపశమనంగా ఉంటుందని వారి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ ఏడాది పండించిన పత్తికి సంబంధించి గుత్తి, తాడిపత్రిలో సీసీఐ కేంద్రాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కనీస మద్దతు ధరను రూ.7,020 (ఎంఎస్‌పీ)గా ఖరారు చేశారన్నారు.

సులభంగా డాక్యుమెంటేషన్

- జిల్లా రిజిస్ట్రార్ పీవీఎన్ బాబు



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా రిజిస్ట్రార్ పీవీఎన్ బాబు

ఉరవకొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రత్యేక యాప్‌తో ఆస్తుల డాక్యుమెంటేషన్ సులభంగా చేసుకోవచ్చని జిల్లా రిజిస్ట్రార్ పీవీఎన్ బాబు తెలిపారు. గురువారం ఉరవకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ కంప్యూటర్ ఎయిడెడ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ డిపార్టుమెంట్ సాఫ్ట్‌వేర్ ద్వారా కార్యకలాపాలు జరుగుతున్నాయన్నారు. ప్రజలు ఆన్‌లైన్‌లోనే డాక్యుమెంట్ సిద్ధం చేసుకుని చలానా చెల్లించవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో స్లాట్‌లు బుక్ చేసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం లేదా గ్రామ/వార్డు సచివాలయాలకు వెళ్తే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. 2023–24 సంవత్సరానికి జిల్లా వ్యాప్తంగా రూ.394 కోట్ల ఆదాయమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఉరవకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో రూ.14 కోట్ల లక్ష్యం విధించామన్నారు. నకిలీ ధ్రువపత్రాలతో రిజిస్ట్రేషన్ చేసినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కొత్త సాఫ్ట్‌వేర్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉరవకొండ సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ సమావేశం మరోసారి వాయిదా

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా జెడ్పీ సర్వసభ్య సమావేశం మళ్లీ వాయిదా పడింది. ఈ మేరకు జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓ/జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. డిసెంబర్ 26న జరగాల్సిన సర్వసభ్య సమావేశం ‘ఆడుదాం-ఆంధ్ర’ కార్యక్రమం కారణంగా వాయిదావేయాల్సి వచ్చిందన్నారు. తిరిగి ఈ నెల 5న నిర్వహించాలని నిర్ణయించగా, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాల అమలులో భాగంగా ద్వైవార్షిక నగదు పంపిణీ కార్యక్రమం దృష్ట్యా సమావేశాన్ని మరోసారి వాయిదా వేసినట్లు వివరించారు. తదుపరి ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని ఆయన వెల్లడించారు.

క్లుప్తంగా

మెరుగైన సంచార పశు వైద్యసేవలు

- పశుసంవర్ధక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం



మాట్లాడుతున్న డాక్టర్ సుబ్రహ్మణ్యం

ఉరవకొండ: పాడి రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సంచార పశు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. సంచార పశువైద్యశాలల ద్వారా మెరుగైన సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉరవకొండ పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకుల కార్యాలయ ఆవరణలో గురువారం నిర్వహించిన పశువైద్య సహాయకులతో సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. సంచార వాహనం ద్వారా గ్రామాల్లో రైతుల ఇంటి వద్దకే వైద్యులు చేరుకుని పశువులకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నారన్నారు. పశువుల వ్యాధి నిర్ధారణ, నట్టల నివారణ, చిన్న తరహా శస్త్ర చికిత్సలు కూడా అక్కడికక్కడే చేస్తారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వైఎస్సార్ పశు బీమా పథకంతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఉరవకొండ పశుసంవర్ధక శాఖ డీడీ డాక్టర్ జి.వెంకటేష్ పాల్గొన్నారు.

ఏడుగురిపై కేసు నమోదు

తాడిపత్రి అర్బన్: యువకుడిని హత్య చేసిన అంశంలో ఏడుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. బుధవారం సాయంత్రం తాడిపత్రిలో సయ్యద్ ఆరీఫ్ ఖాద్రీ (29) హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి హతుడి తల్లి సయ్యద్ ఫక్రూన్నీసా ఫిర్యాదు మేరకు రహంతు, తోఫిక్, అయూఫ్, సాదిక్, షబ్బీర్, మాబుపై పోలీసులను కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు అర్బన్ ఎస్ఐ రామకృష్ణ గురువారం వెల్లడించారు.

'అనంత' సాంకేతిక 'దీప్తి'

- జేఎన్‌టీయూ(ఏ) 13వ స్నాతకోత్సవం రేపు
- ముఖ్య అతిథిగా హాజరు కానున్న చాన్సలర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్
- విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ వర్సిటీ మాజీ వీసీ డాక్టర్ బాల వీరారెడ్డికి గౌరవ డాక్టరేట్
- 86,142 మంది విద్యార్థులకు డిగ్రీలు, 265 మందికి పీహెచ్‌డీల ప్రదానం



స్నాతకోత్సవానికి ముస్తాబైన జేఎన్‌టీయూ (ఏ) ఆడిటోరియం

అనంతపురం: కరువు సీమలో కల్పతరువుగా భాసిల్లుతున్న జేఎన్‌టీయూ (అనంతపురం) మరో స్నాతకోత్సవానికి సిద్ధమైంది. ఎంతో మంది శాస్త్రవేత్తలు, ఇంజినీరింగ్ నిపుణులను సమాజానికి అందించిన జేఎన్‌టీయూ (ఏ) 13వ స్నాతకోత్సవాన్ని శనివారం అట్టహాసంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. సమాజ హిత పరిశోధనలను ప్రోత్సహిస్తూ విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేస్తున్న సాంకేతిక విశ్వవిద్యాలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది.

బంగారు కొండలు వీరే

2021–22 బ్యాచ్‌కు సంబంధించి జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన బి. మేఘనకు నాలుగు బంగారు పతకాలు, వి. చైతన్య రెండు బంగారు పతకాలు, సీబీ సాయికుమార్ ఐదు బంగారు పతకాలు, దాసరి నిర్ణీత మూడు బంగారు పతకాలు, కొండాసాయి తనూజ రెండు బంగారు పతకాలు, మేడా గురు సంతోష్ కుమార్ ఒక బంగారు పతకం, ఎం. సాయి ఉపేంద్రారెడ్డి రెండు బంగారు పతకాలు దక్కించుకున్నారు. అలాగే 2022–23 బ్యాచ్‌కు సంబంధించి... జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన దాసరి శాంతి ఏకంగా 8 బంగారు పతకాలు దక్కించుకుంది. ఇందులో బీటెక్ సివిల్ టాపర్స్, 1982 ఎండోమెంట్ బంగారు పతకం, చల్లా సుబ్బరాయుడు స్మారక బంగారు పతకాలు రెండు, కె.వెంకటేశ్వర రావు బంగారు పతకం, ప్రొఫెసర్ టీఎస్ రాఘవన్ స్మారక బంగారు పతకం, చుండుపల్లి వెంకటరాయలు, సరోజమ్మ స్మారక బంగారు పతకం, ప్రొఫెసర్ బి.విజయభాస్కర్ దేశాయ్ దంపతుల బంగారుపతకం ఉన్నాయి. అలాగే మరో విద్యార్థిని ఎం.నిత్యశ్రీ రెండు బంగారు పతకాలు, కె.వంశీ మూడు బంగారు పతకాలు, ఎస్.సుమంత్ రెండు బంగారు పతకాలు దక్కించుకున్నారు.

ప్రొఫెసర్ బాల వీరారెడ్డికి గౌరవ డాక్టరేట్



అనంతపురంలోని క్యాంపస్ కళాశాలలో 1958–1963లో బీటెక్ పూర్తి చేసిన బాల వీరారెడ్డి శనివారం పూర్వ విద్యార్థి హోదాలో గౌరవ డాక్టరేట్‌ను అందుకోనున్నారు. కర్ణాటక రీజనల్ ఇంజినీరింగ్ కళాశాల (ప్రస్తుతం నేషనల్ ఇనిస్టిట్యూట్ టెక్నాలజీ, సూరత్‌కల్, కర్ణాటక)లో పలు హోదాల్లో ఆయన పనిచేశారు. కర్ణాటక డైరెక్టరేట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్, బెళగావిలోని విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ యూనివర్సిటీకి రెండు దఫాలు వీసీగా పనిచేశారు. వివిధ అవార్డులు అందుకున్నారు. అలాగే 86,142 మంది విద్యార్థులకు డిగ్రీలు, 265 మందికి పీహెచ్‌డీలు ప్రదానం చేయనున్నారు.

అగ్రగామిగా తీర్చిదిద్దుతాం



సమావేశంలో మాట్లాడుతున్న జేఎన్‌టీయూ వీసీ డాక్టర్ జింకా రంగజనార్ధన

అన్ని రంగాల్లోనూ జేఎన్‌టీయూ(ఏ)ను అగ్రగామిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అందరినీ సమన్వయం చేసుకుని పనిచేస్తున్నట్లు ఆ వర్సిటీ వీసీ డాక్టర్ జింకా రంగజనార్ధన అన్నారు. గురువారం ఆయన జేఎన్‌టీయూ(ఏ)లోని మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్ తదితరులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గౌరవ డాక్టరేట్‌ను ప్రొఫెసర్ బాలవీరారెడ్డికి అందజేయడం గర్వంగా ఉందన్నారు. స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా గవర్నర్ /చాన్సలర్ జస్టిస్ ఎస్.అబ్దుల్‌నజీర్, విశిష్ట అతిథిగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ముఖ్యవక్తగా పోలవరం ప్రాజెక్ట్ చీఫ్ అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ ప్రొఫెసర్ వి.సత్యనారాయణరాజు హాజరవుతారన్నారు. మొత్తం 86,142 మందికి స్నాతకోత్సవ పట్టాలు అందించనున్నట్లు వివరించారు.

ఐఈఎస్ సాధించాలన్నదే లక్ష్యం



“ మాది పుట్టపర్తి. అమ్మ సావిత్రి. నాన్న నరసప్ప ఎలక్ట్రీషియన్‌గా ఉన్నారు. సివిల్ ఇంజినీరింగ్‌లో టాపర్‌గా నిలవడం చాలా సంతోషంగా ఉంది. ఒకే దఫా 8 బంగారు పతకాలు దక్కించుకోవడం గర్వకారణం. ఇది వరకే క్యాంపస్ ఇంటర్వ్యూల్లో టీసీఎస్, కాగ్నిజెంట్ కంపెనీల్లో మంచి ఆకర్షణీయమైన ఉద్యోగ అవకాశాలు వచ్చాయి. అయినా ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీసెస్ సాధించడమే నా లక్ష్యంగా వాటిని తిరస్కరించా. నా ఉన్నతికి సహకరించిన వర్సిటీ ప్రొఫెసర్లకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నా. ప్రత్యేకించి రిజిస్ట్రార్ శశిధర్ సార్ సహకారం మరువలేనిది.

– దాసరి శాంతి, 8 బంగారు పతకాల విజేత

శిక్షణ ఇవ్వడం ఉపయోగపడింది



పరిగి మండలం కాలువపల్లి గ్రామానికి చెందిన నేను సాధారణ రైతు కుటుంబం నుంచే వచ్చాను. అమ్మ అలివేలమ్మ, నాన్న ఆనందప్ప వ్యవసాయం చేస్తూ నన్ను చదివించారు. జేఎన్‌టీయూ క్యాంపస్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో 2021–22 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏకంగా ఐదు బంగారు పతకాలు రావడం చాలా గర్వంగా ఉంది. ఫెయిల్ అయిన వారికి సాయం చేయాలనే ఉద్దేశ్యంతో వారికి ప్రత్యేకంగా శిక్షణ ఇస్తూ వచ్చాను. అదే నా ఈ విజయానికి కారణమైంది. ఈ స్ఫూర్తితో ఐఈఎస్ సాధిస్తాననే నమ్మకం కలిగింది. ”

– సీబీ సాయికుమార్, ఐదు బంగారు పతకాల విజేత

జనవాక్కు

కంటి చూపు బాగుపడింది



గుమాస్తా పనితో జీవనం సాగించే నేను కంటి చూపు మందగించడంతో నానా ఇబ్బందులు పడ్డాను. తప్పిదాలు జరగకూడదని పని మానేశా. మూడు నెలల క్రితం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కింద వైద్య శిబిరంలో డాక్టర్లు కంటి పరీక్షలు నిర్వహించి, అనంతపురంలోని ఆస్పత్రికి పిలుచుకెళ్లి ఉచితంగా ఆపరేషన్ చేశారు. కంటి అద్దాలతో పాటు, మందులు ఉచితంగా ఇచ్చారు. రానుపోనూ చార్జీలు కూడా ప్రభుత్వమే చెల్లించింది. ఇప్పుడు నా కంటి చూపు బాగుపడింది. పేదల అవసరాలు గుర్తించి ఎప్పటికప్పుడు తీరుస్తున్న సీఎం వైఎస్ జగన్ పాలన ఎంతో బాగుంది. ఆయనకు మేమెంతో రుణపడి ఉన్నాం.

– ఇమామ్‌సాహెబ్, తిలక్‌నగర్, గుంతకల్లు

జగనే మళ్లీ సీఎం కావాలి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మాలాంటి వృద్ధుల ఇబ్బందులు చాలా తీరాయి. గతంలో పింఛన్ కోసం నానా అగచాట్లు పడ్డాం. రోజుల తరబడి ఆఫీసుల వద్ద పడిగాపులు కాచేవాళ్లం. ఇప్పుడా పరిస్థితి లేదు. ప్రతి నెలా 1వ తారీఖున ఇంటి వద్దకే వలంటీర్ వచ్చి పింఛన్ సొమ్ము ఇస్తున్నాడు. పోయిన నెల వరకూ రూ.2,750 ఇచ్చారు. ఈ నెల నుంచి రూ.3వేలు ఇస్తున్నారు. ప్రజలందరూ బాగుండాలంటే వైఎస్ జగనే మళ్లీ ముఖ్యమంత్రి కావాలి.

– బోయ అంజినమ్మ, కొలగానహళ్లి, బొమ్మనహాళ్ మండలం

నా ఆయుష్షు కూడా జగన్‌కే



గతంలో పింఛన్ తీసుకోవాలంటే తెల్లారగట్లే రచ్చబండ కట్ట వద్దకెళ్లేవాళ్లం. ఎప్పుడు వస్తారో... రారో కూడా తెలియదు. కనీసం నీళ్లు పోసేవాళ్లు కూడా ఉండరు. ఆకలి, దప్పికతో అలాగే కాచుకుని ఉండేవాళ్లం. ఇలా ఒక్కోసారి రెండు మూడు రోజులు గడిచిపోయేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. ప్రతి నెలా 1వ తారీఖున తెల్లవారుజామునే వలంటీర్ ఇంటి వద్దకే వచ్చి పింఛన్ ఇస్తున్నాడు. వైఎస్ జగన్ పాలనలో మా తిప్పలన్నీ దూరమయ్యాయి. నా ఆయుష్షు కూడా పోసుకుని ఆ బిడ్డ మళ్లీ సీఎం కావాలని కోరుకుంటున్నా.

– బోయ సిద్ధమ్మ, ఉద్దేహాళ్, బొమ్మనహాళ్ మండలం

సొంతింటి కల నెరవేరింది



మాది ఉమ్మడి కుటుంబం. సొంతిల్లు లేదు. గత ప్రభుత్వంలో విశ్వ ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత మాకు ఇల్లు మంజూరైంది. ఇప్పుడు సొంతిల్లు కట్టుకున్నాం. చాలా సంతోషంగా ఉంది. సీఎం వైఎస్ జగన్‌కు ఎంతో రుణ పడి ఉన్నాం. ఆయన చేసిన మేలు మరువలేం.

– జీవిత, పాల్తూరు, విడపనకల్లు మండలం

రేషన్ బియ్యం స్వాధీనం

అనంతపురం క్రైం: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గురువారం ఉదయం అనంతపురంలోని తపోవనం కూడలి విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అశోక లైల్యాండ్ పికప్ వ్యాన్‌ను సీజ్ చేశారు. బియ్యం తరలిస్తున్న రాఘవేంద్ర, నరేష్, అంకన్నగారి మహేష్, బోయ సతీష్‌ను అదుపులోకి తీసుకుని నాల్గో పట్టణ పోలీసులకు అప్పగించారు.

పసికందులకు కంటి పరీక్షలు

అనంతపురం మెడికల్: బరువు తక్కువ, నెలలు నిండక జన్మనిచ్చిన 20 మంది చిన్నారులకు ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇన్‌టర్వెన్షన్ సెంటర్(డీఈఐసీ)లో గురువారం ఉదయం కంటి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. 12 మంది చిన్నారుల్లో కంటి సమస్యలను పరీక్షలు నిర్వహించిన కడప పుష్పగిరి ఆస్పత్రి వైద్యులు గుర్తించారు. వీరికి రెండు వారాల తర్వాత మరోసారి రెటీనా పరీక్షలు నిర్వహించి, సమస్య బయటపడితే పుష్పగిరి ఆస్పత్రి వైద్యులు ఉచితంగా చికిత్సలందిస్తారని రాష్ట్రీయ బాల స్వస్థ ఆరోగ్య కార్యక్రమం పర్యవేక్షణాధికారి డాక్టర్ నారాయణస్వామి తెలిపారు. కార్యక్రమంలో డీఈఐసీ వైద్యురాలు డాక్టర్ శ్రీ విద్య, కంటి పరీక్ష నిపుణురాలు జ్ఞాన ప్రసన్న, మేనేజర్ రజిత, స్టాఫ్‌నర్సులు మౌనిక, దివ్య పాల్గొన్నారు.

రిమాండ్‌కు యోగా టీచర్



అనిల్‌కుమార్‌రెడ్డి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

గుత్తి: బాలికకు మాయ మాటలు చెప్పి శారీరక అవసరాలు తీర్చుకున్న యోగా టీచర్ అనిల్‌కుమార్‌రెడ్డిని గురువారం పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. గుత్తి పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను డీఎస్పీ నర్సింగప్ప, ఎస్ఐ నబీరసూల్ వెల్లడించారు. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మండలం చౌడూరు గ్రామానికి చెందిన అనిల్‌కుమార్‌రెడ్డి గుత్తి మండలంలోని ఓ జెడ్పీహెచ్ఎస్‌లో ఔట్ సోర్సింగ్ కింద యోగా టీచర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో అదే పాఠశాలలో చదువుతున్న ఓ బాలికను మాయమాటలతో లోబర్చుకుని శారీరక అవసరాలు తీర్చుకుంటూ వచ్చాడు. ఈ క్రమంలో బంగారు నగలు తీసుకువస్తే పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. దీంతో గత నెల 25న ఇంట్లోని బంగారు నగలు తీసుకెళ్లి అనిల్‌కుమార్‌రెడ్డికి ఆమె ఇచ్చింది. అదే రోజు బాలికను కర్నూలు జిల్లా అహోబిలానికి తీసుకెళ్లాడు. అక్కడ ఓ గది అద్దెకు తీసుకుని వారం రోజుల పాటు బాలికపై అత్యాచారం చేస్తూ వచ్చాడు. తమ కుమార్తె కనిపించకపోవడంతో బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసిన ఎస్ఐ నబీరసూల్... పక్కా ఆధారాలతో గురువారం ఉదయం అనంతపురం రోడ్డులోని బజాజ్ షోరూమ్ వద్ద తచ్చాడుతున్న అనిల్‌కుమార్‌రెడ్డిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం నేరాన్ని ఆయన అంగీకరించడంతో చీటింగ్, కిడ్నాప్, పోక్సో కేసులు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. ఇదే కేసులో మరింత లోతైన దర్యాప్తు చేయాల్సి ఉందని, ఈ క్రమంలో నిందితుడిని పోలీస్ కస్టడీకి కోరనున్నట్లు డీఎస్పీ నర్సింగప్ప తెలిపారు. కాగా, అనిల్‌కుమార్‌రెడ్డి 2019లో ప్రొద్దుటూరులో ఓ మహిళను బలాత్కారం చేసిన కేసులో రిమాండ్ ఖైదీగా జీవితం గడిపి వచ్చాడన్నారు. నిందితుడి అరెస్ట్‌లో చొరవ చూపిన గుత్తి పోలీసులను ఎస్పీ అన్బురాజన్ ఫోన్‌లో ప్రత్యేకంగా అభినందించారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం


- కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య



ఎంపీ రంగయ్యను సన్మానిస్తున్న కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు

కళ్యాణదుర్గం: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీని మరోసారి అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా కలిసికట్టుగా పనిచేద్దామని కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య పిలుపునిచ్చారు. కళ్యాణదుర్గంలో గురువారం రెండో రోజూ ఆయన పర్యటించారు. ముందుగా మున్సిపల్ కార్యాలయంలో స్థానిక నాయకులు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులతో సమావేశమై మాట్లాడారు. పార్టీ అధిష్టానం ఆదేశం మేరకు వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా అందరూ సమష్టిగా పనిచేయాలన్నారు. చిన్న పొరపాట్లు ఉంటే సర్దుకుపోవాలని సూచించారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా త్వరలో పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ఎంపీ రంగయ్యను కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, జెడ్పీటీసీలు బొమ్మన్న, మంజునాథ్, మున్సిపల్ చైర్మన్ తలారి రాజ్‌కుమార్, పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, నాయకులు గోళ్ల సూరి, తలారి వెంకటేశులు, దొణస్వామి, ములకనూరు గోవిందు, భాస్కర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, బాలాసోము, తిమ్మప్ప, బాబు, కామక్కపల్లి మల్లి, నారాయణస్వామి, టైలర్ శీను, సూరి, రాజు, గంగాధర్, కిరీటి యాదవ్, షేక్షావలి, జేసీఎస్ కన్వీనర్లు అర్చన, తిప్పేస్వామి, వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు సురేష్, ఫల్గుణ ప్రసాద్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



శివకుమార్ (ఫైల్)

రాయదుర్గం(డి హీరేహాళ్): జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని కమ్మరచేడు గ్రామానికి చెందిన శివకుమార్ (31)కు ఇటీవల డి.హీరేహాళ్ మండలం పులకుర్తికి చెందిన కృష్ణవేణితో వివాహమైంది. కొంత కాలంగా మతిస్థిమితం కోల్పోయి ఇంటి పట్టున ఉండకుండా తిరగడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో వారం రోజుల క్రితం భర్తను పిలుచుకుని పుట్టింటికి కృష్ణవేణి చేరుకుంది. ఈ నెల 1న చెప్పపెట్టకుండా ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. గురువారం ఉదయం హిద్దేహాళ్ గ్రామ సమీపంలోని సపోట తోట వద్ద చెట్టుకు ఉరి వేసుకుని కనిపించాడు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ రంగడు యాదవ్ తెలిపారు.

విజయవాడ ఎక్స్‌ప్రెస్ రైళ్లు కిటకిట!



అమరావతి ఎక్స్‌ప్రెస్ కోసం వేచి ఉన్న భవానీ మాలధారులు

గుంతకల్లు: భవానీ దీక్ష విరమణను పురస్కరించుకుని మాలాధారులతో విజయవాడ వైపుగా వెళ్లే అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు కిటకిటలాడుతున్నాయి. అనంత జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది వేలాది మంది భవానీ మాలను ధరించారు. ఈ నెల 3 నుంచి దీక్షాపరుల ఇరుముడి సమర్పణ కార్యక్రమం మొదలైంది. ఈ నేపథ్యంలో గుంతకల్లు, ఉరవకొండ నియోజకవర్గాలోని భవానీ మాలధారులతో పాటు కర్నూలు జిల్లా ఆలూరు, పత్తికొండ నియోజకర్గాల్లోని దీక్షాపరులు గుంతకల్లు జంక్షన్ మీదుగా విజయవాడకు రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో బెంగుళూరు–భువనేశ్వర్ (ప్రశాంతి ఎక్స్‌ప్రెస్), హుబ్లీ–విజయవాడ, వాస్కోడిగామా–విజయవాడ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రయాణికులతో కిక్కిరిస్తున్నాయి. ఈ నెల 7వ తేదీ పూర్ణాహుతితో భవానీ దీక్ష ముగుస్తుంది. అప్పటి వరకూ ఇదే రద్దీ కొనసాగుతుందని అంచనా. అలాగే సంక్రాంతి సెలవులు వస్తుండడంతో ఇప్పటికే గుంతకల్లు జంక్షన్ మీదుగా రాకపోకలు సాగించే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లలో రిజర్వేషన్ల వెయిటింగ్ లిస్ట్ భారీగా పెరిగింది. ఈ క్రమంలో జనరల్ బోగీల్లో ప్రయాణించే వారి పరిస్థితి మరి దారుణంగా మారింది.

ఆగ్రోస్ ఆస్తుల జప్తు



ఆగ్రోస్ కార్యాలయం ఎదుట దండోరా వేస్తున్న దృశ్యం

అనంతపురం అగ్రికల్చర్: ఏపీ ఆగ్రోస్ అనంతపురం కార్యాలయ ఆస్తులు అమ్మడానికి, కొనడానికి వీలు లేదని లేబర్ కోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆ శాఖ విశ్రాంత అధికారి ఈశ్వర్‌రెడ్డి 'సాక్షి'కి గురువారం వెల్లడించారు. 1997లో ఆగ్రోస్ కార్యకలాపాలపై వచ్చిన అభియోగాలకు తనతో పాటు మరో ఐదుగురిని సస్పెండ్ చేశారన్నారు. రెండు సంవత్సరాల పాటు సాగిన శాఖ పరమైన విచారణలో కొందరు వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకోగా మరో ఇద్దరికి ఇంక్రిమెంట్లు కట్ చేసి ఉద్యోగంలోకి తీసుకున్నారని గుర్తు చేశారు. తనకు అన్యాయం చేస్తూ ఉద్యోగం నుంచి తొలగించారన్నారు. ఈ అన్యాయంపై 2000 సంవత్సరంలో అనంతపురం లేబర్ కోర్టులో పిటీషన్ దాఖలు చేశానని, దీనిపై 2003లోనే తనకు అనుకూలంగా కోర్టు తీర్పు వచ్చిందన్నారు. ఈ అంశాన్ని సవాల్ చేస్తూ సంస్థ యాజమాన్యం హైకోర్టుకు అప్పీల్ చేసి, 2016లో పిటీషన్‌ను వెనక్కు తీసుకుందన్నారు. 2014లో తన పదవీకాలం ముగియడంతో ఉద్యోగ విరమణ చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో తనకు అందాల్సిన బెనిఫిట్స్‌పై 2020లో మరోసారి లేబర్‌కోర్టును ఆశ్రయించడంతో ఆస్తులను జప్తు చేస్తూ న్యాయస్థానం గురువారం తీర్పు వెలువరించిందన్నారు.

ఆటో బోల్తా.. ఆరుగురికి గాయాలు

గార్లదిన్నె: ఆటో బోల్తాపడిన ఘటనలో ఆరుగురు ప్రయాణికులు గాయపడ్డారు. వివరాలు.... గురువారం ఉదయం అనంతపురం నుంచి ప్రయాణికులతో పామిడికి బయలుదేరిన ఆటో... గార్లదిన్నె మండలం రామదాసుపేట వద్దకు చేరుకోగానే 44వ జాతీయ రహదారిపై డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో రోడ్డుపై అడ్డంగా బోల్తాపడింది. ఆటోలో ప్రయాణిస్తున్న పోతన్న, ఫరీదా, హసీనా, వెంకటలక్ష్మి, షబానాతో మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని క్షతగాత్రులను అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో కాల భైరవాష్టమి



హెచ్చెల్సీ కాలనీలోని కాలభైరవేశ్వరుడికి పూజలు చేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పూజలందుకునే కాలభైరవాష్టమి వేడుకలు గురువారం జరిగాయి. నగరంలోని హెచ్చెల్సీ కాలనీలోని మంజునాథ అన్నపూర్ణేశ్వరి ఆలయ ప్రాంగణంలో అష్టకాల భైరవుడిగా ప్రసిద్ధి చెందిన స్వామికి ఉదయం పంచామృతాభిషేకం, భస్మగంధార్చన, ఫలరస అభిషేకాల అనంతరం రుద్రం చమకంతో రుద్రాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు బసవరాజస్వామి ఆధ్వర్యంలో తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

ఎస్కేయూలో ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ అక్తర్ సాహెబ్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్–1 ప్రోగ్రాం ఆఫీసర్ పి. సత్యసౌమ్య ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వైద్యులు డాక్టర్ అక్బర్ సాహెబ్, డాక్టర్ రాణి ఐశ్వర్య (కంటి డాక్టర్), డాక్టర్ కే మౌనిక రెడ్డి (దంత చికిత్స) ఉచితంగా పరీక్షలు చేశారు. బెస్ట్‌కేర్ డయాగ్నస్టిక్ ల్యాబ్ సహకారంతో ఉచిత షుగర్ పరీక్ష చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం వీ లక్ష్మయ్య హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ డి. మురళీధర్ రావు, ఎస్వైకే చైర్మన్ శ్రీనివాసులు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆగ్రోస్ ఇంచార్జ్ ఆర్ఎంగా విద్యాసాగర్



అనంతపురం అగ్రికల్చర్: ఆగ్రోస్ ఇన్‌చార్జ్ ఆర్ఎంగా విద్యాసాగర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న చంద్రబాబు.. గత నెలాఖరులో ఉద్యోగ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో చిత్తూరులో పని చేస్తున్న విద్యాసాగర్‌కు ఇక్కడ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

జాతీయ జూడో పోటీలకు నసనకోట విద్యార్థిని



జాతీయ స్థాయి జూడోపోటీలకు ఎంపికైన తేజశ్విని

రామగిరి: మండలంలోని నసనకోట జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థిని తేజశ్విని జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ చామంతి గురువారం తెలిపారు. రెండు నెలల్లో స్కూల్ గేమ్స్ తరఫున రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీల్లో తేజశ్విని బంగారు పతకం సాధించిందని, ఈనెల 6 నుండి 11 వరకు పంజాబ్‌లో జరగనున్న జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

గార్లదిన్నె: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్ఐ సాగర్ పేర్కొన్నారు.గురువారం కల్లూరులో ఆర్టీసీ సంస్థ ఆధ్వర్యంలో రోడ్డు నిబంధనలపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ వాహనదారులు పాటించాల్సిన నిబంధనలు వివరించారు. ఆర్టీటీ ఏటీఎల్ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల తయారీ కేంద్రం తనిఖీ



ఎరువుల తయారీ కేంద్రంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ రవి

శింగనమల: మండలంలోని లోలూరు క్రాస్ వద్ద నున్న భాస్కర్ ఎరువుల తయారీ కేంద్రాన్ని గురువారం అనంతపురం ఏడీఏ రవి, ఏఓ అన్వేష్ తనిఖీ చేశారు. ఎరువుల తయారీ, మార్కెటింగ్ లైసెన్స్‌లు, స్టాక్ రిజిస్టర్లు, రికార్డులు, ఎరువుల గోడౌన్‌ను, ల్యాబ్‌ను పరిశీలించారు. ఎరువుల వివరాలు ఎప్పటికప్పుడు వ్యవసాయ ఉన్నతాధికారులకు తెలియజేయాలని ఎరువుల తయారీ కేంద్రం మేనేజర్ శ్రీకాంత్‌కు సూచించారు. ఎరువుల తయారీ కేంద్రంలో ఎస్ఎస్‌పీ 51.25 టన్నులు, 22-0-11 ఎరువులు 93 మెట్రిక్ టన్నులు ఉన్నట్లు మేనేజర్ తెలిపారు.

మంచి చేసిన జగనన్నను ఆశీర్వదించండి

- గార్మెంట్స్ పరిశ్రమతో వేలాదిమందికి ఉపాధి
- ఆలమూరు జగనన్న కాలనీ పక్కన 11.50 ఎకరాల్లో ఫ్యాక్టరీ
- రూరల్ మండలంలో పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



ఇటుకలపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: అన్ని వర్గాల వారికీ మంచి చేసిన జగనన్నను జగనన్నను మరోమారు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కోరారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేశామని, సుమారు 4 వేల మంది మహిళలకు ఉపాధి కల్పించేందుకు అనంతపురం రూరల్ మండలం ఆలమూరు జగనన్న కాలనీ పక్కన గార్మెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. మొత్తం 11.50 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించిందని, ఫ్యాక్టరీ కూడా ప్రభుత్వమే నిర్మిస్తుందన్నారు. గురువారం అనంతపురం రూరల్ మండలం చియ్యేడు, ఉప్పరపల్లి, పూలకుంట, కందుకూరు, ఆకుతోటపల్లి, ఇటుకలపల్లి, మన్నీల, కక్కలపల్లి గ్రామాల్లో కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా 49 వేల పింఛన్లు ఇస్తున్నామన్నారు. పరిటాల సునీత ఉన్నప్పుడు ఇందులో సగం కూడా ఇవ్వలేదన్నారు. అనంతపురం రూరల్ మండలంలోనే 17 వేల పింఛన్లు ఇస్తున్నామన్నారు. రూరల్ మండంలో దాదాపు 400 కోట్లు విలువ చేసే ఇళ్ల పట్టాలు అక్కచెల్లెమ్మలకు ఇచ్చామన్నారు. నియోజకవర్గంలో రైతులకు 2 వేలు బోర్లు ఉచితంగా వేశామన్నారు. పాడి రైతుల కోసం అమ్మ డెయిరీ ఏర్పాటు చేశామన్నారు.

అక్కచెల్లెమ్మలను వంచించిన చంద్రబాబు..

చంద్రబాబు 2014 ఎన్నికల ముందు డ్వాక్రా అక్కచెల్లెమ్మల రుణాలు, రైతుల రుణాలన్నీ మాఫీ చేస్తానని హామీ ఇచ్చి, మోసం చేశారని ఎమ్మెల్యే విమర్శించారు. ఇంటికో ఉద్యోగం, లేదంటే ప్రతినెలా రూ.2 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. అదికూడా పట్టించుకోలేదన్నారు. ఐదేళ్లలో అన్ని వర్గాలను నట్టేట ముంచారన్నారు. జన్మభూమి కమిటీ సభ్యులకు 10 శాతం ఇచ్చి 90 శాతం చంద్రబాబు దోచుకున్నారన్నారు. రెండెకరాల ఆసామి రెండు లక్షల కోట్లకు ఎలా ఎదిగాడో ప్రజలు ఒకసారి ఆలోచించాలని కోరారు. దీంతో 2019 ఎన్నికల్లో ప్రజలు ఆయన్ను తిరస్కరించారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకొచ్చిన తర్వాత రాష్ట్రంలో 30 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారన్నారు. ఆలోచన చేయండి... జగనన్నకు మీ అందరి ఆశీర్వాదం కావాలి.. వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ పుల్లయ్య, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నాగేశ్వరరెడ్డి, ఎంపీపీ గుజ్జల వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ దుగుమర్రి గోవిందరెడ్డి, సర్పంచ్‌లు గంగాధర్ రెడ్డి, కృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సావిత్రి శ్రీనివాసులు, ప్రశాంత్‌కుమార్, గార్లదిన్నె కృష్ణయ్య, గురుప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు సునీల్‌దత్తరెడ్డి, భారతి, సోమశేఖర్‌రెడ్డి, రాగే రేవతిపెద్దప్ప, పెన్నోబులేసు, మారెన్న, నాయకులు నారాయణరెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మలిరెడ్డి, రవంద్రారెడ్డి, చలపతి, నాగేంద్రరెడ్డి, పెద్దిరెడ్డి, రాఘవరెడ్డి, కేపీ ఓబులేసు, రమేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ రఘునాథ్, జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి గురువారం తెలిపారు. వారు మాట్లాడుతూ అన్ని సచివాలయల పరిధిలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. మెదటగా ఉదయం 9 గంటలకు ముట్టాలలో ఎమ్మెల్యే పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు.

విద్యార్థులకు మోడల్ పేపర్ల పంపిణీ

బెళుగుప్ప: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ మండలశాఖ ప్రతినిధులు ఉచితంగా సాధన మోడల్ పేపర్లను పంపిణీ చేశారు. గురువారం పాఠశాలలో హెచ్ఎం దుర్గాప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీడీఓ రామచంద్ర, ఎంఈఓలు మల్లారెడ్డి, హరికృష్ణ పాల్గొని యూటీఎఫ్ శాఖ సభ్యులతో కలసి విద్యార్థులకు మోడల్ పేపర్లు అందజేశారు. అనంతరం యూటీఎఫ్ శాఖ నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలను మండల అధికారులు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి అర్జున్, మండల గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులుతో కలసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మారుతి, శ్రీనివాసులు, మహమ్మద్ రఫీ, నాగరాజు, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ పింఛన్ కానుక దేశానికే ఆదర్శం

- మేయర్ వసీం



పింఛన్ పంపిణీ చేస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ పింఛన్ కానుక దేశానికే ఆదర్శమని మేయర్ వసీం పేర్కొన్నారు. గురువారం నగరంలోని 32, 43, 46,62,63 సచివాలయాల పరిధిలో నిర్వహించిన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. మేయర్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ రూ.3వేలు చేసినట్లు తెలిపారు. గతంలో 39 లక్షల మందికి మాత్రమే పింఛన్ అందే పరిస్థితి ఉండేదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా పింఛన్ అందిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 66.34 లక్షల మందికి, నగరంలో నగరంలో 23,721 పింఛన్లు అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. గతంలో పింఛన్ తీసుకోవాలంటే ప్రభుత్వ స్కూళ్ల వద్ద పడిగాపులుకాసే పరిస్థితి ఉండేదని, ఒక వేళ పింఛన్ జాప్యం జరిగితే నగరపాలక సంస్థ చుట్టూ ప్రదక్షిణలు చేసేవారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ తరహాలో దేశంలో ఎక్కడా పింఛన్ పంపిణీ జరగలేదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇసాక్, అనిల్‌కుమార్ రెడ్డి, కమల్‌భూషణ్, సైపుల్లాబేగ్, నాయకులు కైలాష్, శీన, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి రుణపడి ఉంటాం



ఆత్మకూరులో పైపులలోడుకు పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు

ఆత్మకూరు: మండలంలో దశాబ్దాలుగా నీటి సమస్య ఉంది.. ఎంతో మంది నాయకులు మారినా సమస్య తీరలేదు.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కృషితో మండలానికి జలజీవన్ పథకం ద్వారా రూ.36 కోట్లతో సమస్య తీరబోతోందని మండల ప్రజలు తెలిపారు. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి రుణపడి ఉంటామన్నారు. శ్రీకాళహస్తి నుంచి బయల్దేరిన పైపులు గురువారం ఆత్మకూరుకు చేరుకున్నాయి. దీంతో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు లారీలోని పైపులకు టెంకాయ కొట్టి పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రూ.36 కోట్లు వెచ్చించి, కూడేరు మండలం పీఏబీఆర్ డ్యాం నుంచి 21.500 కిలో మీటర్ల దూరం 1400 పైపులు వేసి, నీటి సమస్య తీరుస్తున్నట్లు తెలిపారు. మంత్రిగా పనిచేసినా పరిటాల సునీత ఏనాడూ ఆత్మకూరు మండలాన్ని పట్టించుకోలేదన్నారు. నాలుగేళ్లలోనే ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఇంటింటికీ కొళాయి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చెన్నారెడ్డి, నాగరాజు, వెంకటేష్, ఆదెప్ప, మాదన్న, వెంకట్రామిరెడ్డి, దామోదర్, శీన, రామన్న, సంజన్న, మురళి తదితరులు పాల్గొన్నారు.

నేడు అనంత వెంకటరెడ్డి వర్ధంతి

అనంతపురం కార్పొరేషన్: మాజీ ఎంపీ అనంత వెంకటరెడ్డి వర్ధంతి వేడుకలను శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి గురువారం పేర్కొన్నారు. ఉదయం 9:30 గంటలకు ప్రభుత్వ సర్వజనాస్పత్రి ముందున్న అనంత వెంకటరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం రోటరీపురం సమీపంలోని అనంత వెంకటరెడ్డి ఘాట్ వద్ద వర్ధంతి కార్యక్రమం ఉంటుందన్నారు.

టాలెంట్ టెస్టుకు దరఖాస్తు చేసుకోండి

కుందుర్పి: ఎస్కే చారిటబుల్ ట్రస్టు పర్యవేక్షణలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 9,10వ తరగతి విద్యార్థులకు ఈ నెల 28న టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నట్లు ట్రస్టు నిర్వాహకుడు లెనిన్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జ్ఞాపకార్థం టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 10 లోపు చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

సమాజంపై అవగాహన అవసరం



రామగిరి స్కిల్ కాలేజీలో డిగ్రీ విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించిన పోలీసులు

రామగిరి: విద్యార్థులకు సమాజంపై పూర్తి అవగాహన అవసరమని సీఐ చిన్నగౌస్ తెలిపారు. గురువారం రామగిరిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్కిల్ డవలప్‌మెంట్ కాలేజీలో డిగ్రీ విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో యువత కీలక పాత్ర పోషించాలన్నారు. సీఐ మాట్లాడుతూ డ్రగ్స్, ఈవ్ టీజింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. మహిళలు, విద్యార్థినులకోసం ప్రభుత్వం 'దిశ' యాప్‌ను తీసుకొచ్చిందని, ఏమైనా ఇబ్బందులున్నా విషయాన్ని వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ జనార్దన్ నాయుడు , పోలీస్ సిబ్బంది, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ పరికరాల చోరీ

గుత్తి రూరల్: బసినేపల్లిలోని వ్యవసాయ తోటలో విద్యుత్ పరికరాలు చోరీకి గురైనట్లు బాధిత రైతు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రైతు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రైతు వెంకట్రాముడు రబీ సీజన్‌లో తన కున్న పొలంలో జొన్న పంట సాగు చేశాడు. బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తన పొలంలోకి ప్రవేశించి రెండు మోటార్ స్టార్టర్లు, విద్యుత్ తీగలు, 18 స్ప్రింక్లర్ పైపులు చోరీ చేశారు. వ్యవసాయ బోరు, మోటారు ధ్వంసం చేయడంతో సుమారు రూ.45 వేలు నష్టం వాటిల్లింది. రెండు రోజుల క్రితం తన పక్క పొలంలో విద్యుత్ పరికరాలు చోరీకి గురయ్యాయని రైతు తెలిపాడు. ఎస్ఐ నబిరసూల్ విచారణ చేపట్టారు.

కనకదాస విగ్రహ ప్రతిష్టకు ఆహ్వానం



ఎమ్మెల్యేను కనకదాస విగ్రహ ప్రతిష్టకు ఆహ్వానిస్తున్న ఎంపీపీ హేమలత, కురుబలు

ఆత్మకూరు: ఆత్మకూరులో ఈ నెల 6,7వ తేదీల్లో కురుబల ఆరాధ్య దైవం కనకదాస విగ్రహ ప్రతిష్టకు రావాలని ఆత్మకూరు కురుబలు, ఎంపీపీ హేమలత ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని గురువారం ఆహ్వానించారు. ఈ నెల 6న ప్రతి ఇంటి నుంచి కలశాలతో బయల్దేరి కనకదాస విగ్రహాన్ని ఊరేగింపు చేయనున్నట్లు తెలిపారు. 7న ఉదయం 6 గంటలకు విగ్రహ ప్రతిష్ట, 10: 30 గంటలకు విగ్రహావిష్కరణ ఉంటుందన్నారు. ఎంపీ మాధవ్, ఎమ్మెల్యే శంకర్‌నారాయణ, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్య ప్రకాష్ బాబు, మాజీ మేయర్ పరుశురాం, విశ్రాంత జడ్జి కిష్టప్ప, రాజహంస శ్రీనివాసులు, అడ్వొకేట్ పద్మావతిని ఆహ్వానించినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో కురుబ సంఘ నాయకులు పోలన్న, మారెన్న, బిల్లే శివయ్య, రామాంజనేయులు, సుబ్బార వీరసాయి పాల్గొన్నారు.

కందిలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

యాడికి: రైతులు కంది పంటలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఏడీఏ వెంకటరాముడు సూచించారు. గురువారం పుప్పాల గ్రామంలో జాతీయ ఆహార భద్రత మిషన్‌లో భాగంగా రైతులు సాగు చేస్తున్న కంది పంటలో క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. పంటలో శనగ పచ్చ పురుగును గమనించిన ఏడీఏ సస్యరక్షణ పద్ధతులను రైతులకు తెలియజేశారు. కందిలో మంచి పూత రావడానికి ప్లానోఫిక్స్‌ను పంటపై పిచికారీ చేయాలన్నారు. అనంతరం గ్రామంలోని ఆర్బీకేను తనిఖీ చేసి రైతులతో సమావేశమయ్యారు. ఆర్బీకేల్లో రైతులకు కావలసిన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందుబాటులో ఉంచామన్నారు. రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేసుకొని ఈకేవైసీ చేసుకుంటే పంటల బీమా, పెట్టుబడి రాయితీ, రైతు భరోసా వస్తాయన్నారు. ఏఓ మహబూబ్ బాబాషా, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

భక్తుల కొంగుబంగారం నారాయణార్యరూఢ స్వామి

బెళుగుప్ప: మండలంలోని విరుపాపల్లిలో వెలసిన సద్గురు నారాయణార్యరూఢ స్వామి కొలిచిన భక్తుల పాలిట కొంగు బంగారంగా వెలుగొందుతున్నారు. సద్గురువు రాంపురం ఎర్రితాత గురుపరంపరలో ఒకరుగా ఆధ్యాత్మిక, కాలజ్ఞాన బోధనలను భక్తులకు ఉపదేశిస్తూ కీర్తి గడించారు. తన మహిమలను ఈ ప్రాంతంతో పాటు కర్ణాటకలోనూ చూపుతూ సద్గురువుగా మారారు. విరుపాపల్లిలో 1973లో పరమపదించడంతో ఆయన సమాధి చుట్టూ భక్తులు ఆలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి 50 సంవత్సరాలుగా ఆరాధన పూజ లు, రథోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నారు.

నేడు స్వామి రథోత్సవం..

మార్గశిర మాసం బహుళ నవమి శుక్రవారం రాత్రికి నారాయణార్యరూఢ స్వామి 50వ ఆరాధనోత్సవాన్ని నారాయణార్యరూడ స్వామి ట్రస్టు నిర్వాహకుడు మారాచి సూర్యారాయణ స్వామి ఆధ్వర్యంలో కొనసాగిస్తారు. రథోత్సవం సందర్భంగా ఆలయంలో తొలుత స్వామి మూలవిరాట్, మహిమాన్విత ఊయలకు జరిగే గంగపూజ, పంచామృతాభిషేక పూజా కార్యక్రమాలను మర్తాడు మఠాధ్యక్షుడు జ్ఞానమూర్తిస్వామి, దివంగత భీమిరెడ్డి సోదర కుటుంబసభ్యుల చేత నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రికి ఆలయ కమిటీకి చెందిన గ్రామ బృందాలతో కలిపి జిల్లా స్థాయి భజన పోటీలను నిర్వహిస్తున్నట్లు మఠం సభ్యులు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యురాలు కుమ్మతి మమత, త్రిలోక్‌రెడ్డి దంపతులు దాతలుగా రూ.5000, రూ.4000, రూ.3000, రూ.2000, రూ.1000 చొప్పున మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన భజన బృందాలకు ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేయనున్నారు. అలాగే ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

చెత్త సేకరణను అడ్డుకున్న కార్మిక నాయకులు



నగర పాలక సంస్థ ఆవరణలో చెత్త పడేసిన దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని వివిధ ప్రాంతాల్లో చెత్త సేకరించకుండా కార్మికులు అడ్డుపడుతున్నారు. గురువారం నగర పాలక సంస్థ కార్యాలయ ఆవరణలో చెత్తను గుట్టలుగా పడేశారు. మేయర్ వసీం పర్యవేక్షణలో మొదటి రోడ్డు ఎక్స్‌టెన్షన్ సచివాలయం ముందు చెత్తను తరలిస్తుండగా కార్మికులు అడ్డుకున్నారు. మేయర్ కార్మికులకు సర్దిచెప్పినా, వారు నానా యాగీ చేశారు. చెత్త తరలింపునకు సహకరించాలని మేయర్ కోరారు. కోవిడ్ కేసులున్నాయని, కొన్ని రోజులుగా చెత్త తరలించకపోతే ప్రజారోగ్యంపై ప్రభావం పడుతుందని మేయర్ సర్దిచెప్పారు. కానీ కార్మికుల్లో ఎలాంటి మార్పు రాలేదు. కాసేపటికి అక్కడ నుంచి చెత్తను తరలించారు. అదనపు కమిషనర్ రమణారెడ్డి, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

రాంనగర్ ఫ్లైఓవర్‌పై చెత్త:

రాంనగర్ ఫ్లైఓవర్‌పైన చెత్త ఊడుస్తున్న రెగ్యులర్ కార్మికులను పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు అడ్డుకున్నారు. చెత్తను ఒకవైపు శుభ్రం చేస్తుండగా, కాళ్లతో చెత్తను రోడ్డుపైకి పడేశారు. రెగ్యులర్ ఉద్యోగులను అడ్డుకున్నారు. ముద్దలాపురం ఫిల్ట్రేషన్ పాయింట్ వద్ద నీటి సరఫరా జరగకుండా కార్మికులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. నగరపాలక సంస్థ అధికారులు స్పందించి చర్యలు తీసుకున్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

అనంతపురం క్రైం: నగరంలోని నవోదయకాలనీకి చెందిన రామాంజనేయులు అనే వ్యక్తి మద్యం అక్రమంగా విక్రయిస్తుండగా అరెస్ట్ చేసినట్లు వన్ టౌన్ సీఐ రెడ్డెప్ప గురువారం తెలిపారు. అతని నుంచి 36 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లుల తెలిపారు.

25 మద్యం బాటిళ్ల స్వాధీనం

యాడికి: మండల కేంద్రంలోని కుంటలో మద్యం విక్రయిస్తున్న శ్రీరంగ అనే వ్యక్తిని గురువారం అరెస్ట్ చేసినట్లు గుత్తి సెబ్ సీఐ వరలక్ష్మి తెలిపారు. నిందితుడి నుంచి 25 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

యల్లనూరు: అక్రమంగా మద్యం అమ్ముతున్న తిమ్మంపల్లికి చెందిన మేకల రామకృష్ణ, శింగవరం గ్రామానికి చెందిన రామాంజనేయులును అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ధరణీబాబు గురువారం తెలిపారు. నిందితుల నుంచి 12 మద్యం బాటిళ్లు, 29 కర్ణాటక టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ఎన్నికల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు

గుంతకల్లు రూరల్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి వివిధ రాజకీయ పార్టీల నాయకులకు తెలియజేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓటు హక్కు నమోదు, ఓటరు కార్డులో మార్పులుచేర్పులు, తొలగింపులు తదితర వాటి కోసం 1,782 దరఖాస్తులను స్వీకరించామన్నారు. దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించి సమర్థవంతంగా ఓటరు జాబితా తయారు చేసేందుకు అవసరమైన చర్యలను చేపడుతున్నామన్నారు. ఓటర్లు ఆధార్‌తో ఓటరు కార్డును అనుసంధానం చేసుకునేలా రాజకీయ పార్టీల నాయకులు అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అవసరమైన అన్ని సౌకర్యాలు, ఏర్పాట్లను చేపడతామని తెలియజేశారు.

'ఆడుదాం ఆంధ్రా' పోటీలు

పెద్దవడుగూరు: మండలంలోని అప్పేచర్ల, పెద్దవడుగూరు–1, క్రిష్టిపాడు –1 గ్రామ సచివాలయాల్లో గురువారం 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు నిర్వహించారు. బ్యాడ్మింటన్, కబడ్డీ, వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, పీఈటీ లింగరాజు, రామచంద్రబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల ఊరేగింపు

యల్లనూరు: అయోధ్య రామమందిరం నుంచి వచ్చిన అక్షింతలను గురువారం మండల కేంద్రంలోని అమ్మవారిశాల నుంచి ఆంజనేయ స్వామి గుడి వరకు పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం వాటిని ఇంటింటికీ పంపిణీ చేసినట్లు ఆర్యవైశ్య సంఘం రాఘవ, చైతన్య తదితరులు తెలిపారు.

అంధుల జీవన ప్రయాణం స్ఫూర్తిదాయకం



పాటలు పాడుతున్న అంధులు



బ్రెయిలీ లిపిలో ఉన్న క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మేయర్ వసీం తదితరులు



లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలో పాల్గొన్న అంధులు

అనంతపురం కల్చరల్: అంధులు మనోధైర్యంతో సాగించే జీవన ప్రయాణం స్ఫూర్తిదాయకమని మేయర్ వసీం అన్నారు. గురువారం లూయిస్ బ్రెయిలీ 215వ జయంతి కార్యక్రమాన్ని జాతీయ అంధుల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. నగరంలోని యాపిల్ ఫంక్షన్ హాలులో మేయర్ వసీం, వికలాంగులశాఖ ఏడీ అబ్దుల్ రసూల్, డాక్టర్ హరిప్రసాద్, సెక్రెడ్ సంస్థ డైరెక్టర్ తిప్పన్న తదితరులు మాట్లాడారు. ఆత్మవిశ్వాసం నింపుకొని కష్టసాధ్యమైన పనిని కూడా సులువుగా సాధించడం అంధులకుమాత్రమే తెలిసిన విద్య అన్నారు. వారు తలచుకుంటే కానిదేమీ లేదన్నారు. సాయిట్రస్టు విజయసాయికుమార్ సౌజన్యంతో అందించిన చేతికర్రలు అంధులకు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అంధుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి రవి, రాష్ట్ర నాయకులు చిన్న అంకిరెడ్డి, కార్పొరేటర్లు అనిల్‌కుమార్‌రెడ్డి, ఇసాక్, వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.